క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జర్నలిస్ట్ కాలనీ, బ్రాహ్మణ్ సదన్, ఎల్లా హోటల్, హిల్ రిడ్జ్ విల్లాస్, గోపీచంద్ అకాడమీ, ఎమ్మార్ ప్రాపర్టీస్, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు జయభేరీ పైన్ వ్యాలీ, కేర్ హాస్పిటల్, ఐడీబీఐ బ్యాంక్, బ్రహ్మ కుమారీస్, ఎస్ఎంఆర్ అపార్ట్‌మెంట్స్, రాక్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రజా సేవే మా లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని పేదలకు సేవ చేయడమే తమ ఆశయమని సందయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. బుధవారం చందానగర్ డివిజన్ పరిధిలోని శంకర్ నగర్ పార్కు, భవానీపురం, వేమన కాలనీ వీకర్ సెక్షన్, న్యూ శంకర్‌నగర్ కాలనీలలో సందయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, బుచ్చిరెడ్డి, చందర్ యాదవ్, గౌస్, ఖాదర్, లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ క్యాంప్



హెల్త్ క్యాంపులో డీసీపీ సందీప్‌కుమార్‌కు పరీక్షలు చేస్తున్న దృశ్యం

గచ్చిబౌలి: నిత్యం పని ఒత్తిడిలో బిజీగా ఉండే పోలీసుల కోసం బుధవారం హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశారు. గచ్చిబౌలి పీఎస్‌లో మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో మాదాపూర్ డీసీపీ సందీప్‌కుమార్ ప్రారంభించారు. బీపీ, షుగర్ ఉన్న వారికి డాక్టర్లు సలహాలు , సూచనలు చేశారు. క్రమం తప్పకుండా హెల్త్ చెకప్‌లు చేసుకోవాలని డాక్టర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాదాపూర్ అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, గచ్చిబౌలి సీఐ జేమ్స్‌బాబు పాల్గొన్నారు.

మహిళ మెడలో నుంచి గొలుసు అపహరణ

హఫీజ్‌పేట్ : మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు అపహరించిన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు.. కొల్లూర్ తండాకు చెందిన లొక్కమ్మ (55) నల్లగండ్ల కూరగాయల మార్కెట్ వద్ద సీతాఫలాలు విక్రయించడానికి వచ్చింది. రోడ్డు పక్కన బుట్ట పెట్టుకొని విక్రయిస్తుండగా అక్కడ గుర్తు తెలియని వ్యక్తి కాపుకాసి ఎవరు లేని సమయంలో మహిళ మెడలో ఉన్న మూడు తులాల బంగారు గొలుసును లాక్కుని పారిపోయాడు. ఆమె చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సీసీ పుటేజీలను పరిశీలిస్తున్నారు.

ఆటవస్తువుల పంపిణీ



చిన్నారులతో కొండాపూర్ బెటాలియన్ అధికారులు

గచ్చిబౌలి: టీఎస్ఎస్‌పీ కొండాపూర్ 8వ బెటాలియన్ అధికారులు బుధవారం ఛీర్స్ ఫౌండేషన్ అనాథ పిల్లలకు ఆట వస్తువులను పంపిణీ చేశారు. కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ ఆధ్వర్యంలో చీర్స్ ఫౌండేషన్‌ను సందర్శించారు. చిన్నారులకు క్యారమ్, చెస్ బోర్డు, రైస్, ఆయిల్ టిన్, బెడ్ షీట్స్, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో కొండాపూర్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు నరసింహస్వామి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్‌రావు, పార్టీ మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతిల నేతృత్వంలో బుధవారం 4వరోజు జయానగర్ నుంచి పాదయాత్ర చేపట్టారు. రాఘవేంద్ర కాలనీ, ఆల్విన్ కాలనీ ఫేజ్ వన్, ఉషోదయ కాలనీ వరకు సాగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ రాష్ట్రంలో నియంతృత్వ నిరంకుశ పాలన సాగిస్తూ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీజే పీ రాష్ట్ర నాయకులు నరేందర్‌రెడ్డి, బీజేవైఎం నేషనల్ ఆఫీస్ కోఆర్డినేటర్ కుమార్ యాదవ్, కో కన్వీనర్ మణిభూషణ్, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

గణేష్‌గడ్డ ఆలయం ముస్తాబు

● 18 నుంచి 28 వరకు ఉత్సవాలు
● భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు: ఈఓ





ఉత్సవాలకు ముస్తాబవుతున్న ఆలయం

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు మండల పరిధిలోని రుద్రారం గణేష్‌గడ్డ సిద్ధి గణపతి ఆలయం నవరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతుంది. గణేష్‌గడ్డ ఆలయంలో కోరిన కోరికలు తీరతాయని భక్తులకు అపార నమ్మకం .ఆలయంలో 108 ప్రదక్షిణలు, 11 వారాలు వ్రతం చేయాల్సి ఉంటుంది. ఈ వ్రతం వల్ల విద్యార్థులు చదువులో, ఉద్యోగం లేని వారు ఉద్యోగాన్ని పొందుతారు. రోగాలతో బాధపడుతున్న వారికి ఆరోగ్యం బాగుపడుతుందని ప్రతీతి. మంగళ, ఆదివారాలు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేస్తారు.కాగా ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలతో పాటు రోజుకు ఒక విశేషాలంకరణలో స్వామివారు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. మొదటి రోజు ఉదయం 6 గంటలకు పంచామృత అభిషేకం, మహాగణపతి పూజ ,మహాగణపతి హోమం, ప్రదోష పూజ, గణపతి వ్రత కల్పం , పల్లకీ సేవతో ప్రారంభమవుతుంది. సెప్టెంబర్ 28 ముగింపు రోజున జాతర నిర్వహిస్తారు. పంచామృతాభిషేకం, మహా నైవేద్యం, మంగళహారతి ,సాంస్కృతిక కార్యక్రమాలు, సాయంత్రం లడ్డూ వేలం ,రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ఈఓ తెలిపారు.

క్యూలైన్లు ఏర్పాటు: ఈఓ మోహన్‌రెడ్డి

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నాం. ఉత్సవాలకు భారీ సంఖ్యలో భక్తులు రానున్న నేపథ్యంలో ప్రతిరోజు ఆలయ ఆవరణలో నిత్యాన్నదానం జరుగుతుంది.

బందోబస్తు ఏర్పాటు చేస్తాం : సీఐ లాలునాయక్, పటాన్‌చెరు

నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆలయం వద్ద బందోబస్తు ఏర్పాటు చేస్తున్నాం. భక్తులు స్వామివారిని క్యూ లైన్‌లో వెళ్లి దర్శించుకునే విధంగా చూడడంతో పాటు ఆలయానికి వచ్చే వాహనాలు కేటాయించిన స్థలంలో పార్కింగ్ చేసేలా చూస్తాం.

హెచ్‌సీయూను సందర్శించిన రిపబ్లిక్ రాయబారి



హెచ్‌సీయూలో వీసీ ప్రొ.బీజేరావును కలిసిన డొమినకల్ రిపబ్లిక్ రాయబారి డేవిడ్ బృందం

రాయదుర్గం: డొమినికల్ రిపబ్లిక్ భారతదేశంలోని రాయబారి డేవిడ్ ప్యూగ్ గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని బుధవారం సందర్శించారు. హెచ్‌సీయూలోని ఎస్పైర్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను కార్యదర్శి బియాంకా బేజ్ సందర్శించారు. ఈ సందర్భంగా సెంటర్‌లోని స్టార్టప్‌లతో వారు ముచ్చటించారు. అక్కడ కల్పిస్తున్న సౌకర్యాలు, ఎదిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావుతో ఈ బృందం ప్రత్యేకంగా సమావేశమైంది. ఈ సందర్భంగా ఎస్పైర్ బయోనెస్ట్‌ను ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ఏర్పాటు చేయడం, డైనమిక్ ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌ను ప్రోత్సహించడాని కి ప్రతిష్టాత్మక కార్యక్రమాల గురించి వారు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వీసీతో సమావేశమై విద్యాభివృద్ధి, కొత్త కోర్సుల ఏర్పాటు, ఉపాధి అవకాశాలపై తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, అధికారులు పాల్గొన్నారు.

'మనూ'లో హిందీ దివాస్



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, ఫ్యాకల్టీ

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో హిందీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ వరకు 'హిందీ దివాస్' కార్యక్రమాన్ని కొనసాగిస్తారు. 'అడ్మినిస్ట్రేటివ్ విషయాలు: నోటింగ్, డ్రాఫ్టింగ్' అనే అంశంపై హిందీ వర్క్‌షాప్ నిర్వహించారు. సికింద్రాబాద్‌లోని అధికార భాషా విభాగం సహాయ సంచాలకులు డాక్టర్ సీమా వర్మ ముఖ్యవక్తగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికార భాష హిందీ అమలు గురించి ఆమె వివరించారు. కార్యక్రమంలో హిందీ అధికారి, కన్వీనర్ డాక్టర్ షగుఫ్తా పర్వీన్, ప్రొఫెసర్ కరణ్‌సింగ్ ఉత్వాల్, ప్రొఫెసర్ వికారున్నీసా, డాక్టర్ ఇరాఖాన్ పాల్గొన్నారు.

శేరిలింగంపల్లిని అగ్రగ్రామిగా నిలపడమే లక్ష్యం



నానక్‌రాంగూడలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే గాంధీ, అధికారులు

ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: శేరిలింగంపల్లిని అన్ని రంగాలలో అగ్రగ్రామిగా నిలపడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ వెల్లడించారు. గచ్చిబౌలి డివిజన్ నానక్‌రాంగూడలో రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను ఆయన మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టిసాయిబాబా, జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులతో కలిసి మంగళవారం రాత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ మౌలిక వసతులకు పెద్ద పీట వేశామన్నారు. నానక్‌రాంగూడలో ఔటర్ రింగురోడ్డు నుంచి సినీహీరో కృష్ణ నివాసం వరకున్న రోడ్డును రూ.1.20 కోట్ల వ్యయంతో చేపట్టడం జరిగిందన్నారు. ఈ రోడ్డు నిర్మాణం చేస్తే నానక్‌రాంగూడ ప్రధాన రోడ్డు మెరుగుపడుతుందని, వాహనాల రాకపోకలకు ఎలాంటి సమస్యలు లేకుండా సాఫీగా సాగేందుకు ఆస్కారం కలుగుతుందన్నారు.

మధురానగర్‌లో పర్యటన..

గచ్చిబౌలి డివిజన్‌లోని మధురానగర్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. యూజీడీ నిర్మాణ పనులను పరిశీలించారు. మధురానగర్ సమస్యలనుపరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఈఈ శ్రీనివాస్, డీఈ విశాలాక్షి, ఏఈ జగదీష్, వర్క్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, నాయకులు గణేష్ ముదిరాజ్, రాజునాయక్, శ్రీనివాస్‌యాదవ్, దారుగుపల్లి నరేష్ పాల్గొన్నారు.

నోవాటెల్‌లో హైబా రెస్టారెంట్ ప్రారంభం



మాదాపూర్: మాదాపూర్‌లోని నోవాటెల్‌లో బుధవారం హైబా (హైదరాబాద్ బ్రింగ్స్ అరేబియా) ను ప్రారంభించారు. ఈ రెస్టారెంట్‌లో ప్రత్యేకంగా అరేబియన్ వంటకాలను అందుబాటులో ఉంచినట్లు చెఫ్ కైలాష్ తెలిపారు. హైబా రెస్టారెంట్‌లో జుజే కబాబ్, లాంబ్ ట్యాగిన్, రుజ్ బుఖారీ, కునాఫా తదితరాలు అందుబాటులో ఉంటాయని నోవాటెల్ హైదరాబాద్ కన్వెన్షన్ సెంటర్ జనరల్ మేనేజర్ రూబిన్ చెరియాన్ తెలిపారు.

అంగన్‌వాడీల సమ్మె

శేరిలింగంపల్లి: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీలు మూడవరోజు సమ్మె చేశారు. ఈ సమ్మెకు ఎంసీపీఐ(యూ) నాయకులు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంసీపీఐ యూ(యూ) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి వర్గ సభ్యులు ఇస్లావత్ దశరథ్ నాయక్ మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాల నుంచి చాలీచాలని జీతంతో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల కనీస వేతనం రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వారి ఉద్యోగానికి చట్టభద్రత కల్పించాలని, అలాగే వీరికి పెన్షన్ ఉద్యోగ విరమణ బెనిఫిట్స్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలన్నారు. కార్యక్రమంలో గ్రేటర్ నాయకులు పల్లె మురళి, పుష్ప, లక్ష్మీ, నర్సింహ, సుల్తానాబేగం, రజియా బేగం పాల్గొన్నారు.



అంగన్‌వాడీ బృందంతో ధర్నా చేస్తున్న వామపక్ష నేతలు

ముగిసిన వర్క్‌షాప్

రాయదుర్గం: ఉర్దూ విశ్వవిద్యాలయంలో నాలుగురోజులపాటు నిర్వహించిన అంతర్జాతీయ వర్క్‌షాప్, ఖగోళ శాస్త్ర డేటా విశ్లేషణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్, మ్యాథమెటిక్స్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. క్యాంపస్‌లోని లైబ్రరీ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ అధ్యక్షత వహించి ఈ సదస్సు ప్రాధాన్యతను వివరించారు.

పత్ర సమర్పణ

రాయదుర్గం: యునైటెడ్ కింగ్‌డమ్ ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక యునైటెడ్ కింగ్‌డమ్ ఫోరమ్ ఫర్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్(యూకెఎఫ్ఐఈటీ)–2023 సదస్సులో మనూ ఫ్యాకల్టీ ముగ్గురు పత్ర సమర్పణ చేశారు. 'సామాజిక, పర్యావరణ న్యాయం కోసం విద్య: వైవిధ్యం, సుస్థిరత, బాధ్యత' అనే అంశంపై పత్ర సమర్పణ చేశారు. హైదరాబాద్ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ డాక్టర్ మహ్మద్ యూసుఫ్‌ఖాన్, ఉర్దూ మీడియం టీచర్స్ సెంటర్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ మహ్మద్ అబ్దుల్ సమీ సిద్దిఖీ, పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ సయ్యద్ ముజాహిద్ పాషా ఉపాధ్యాయుల శిక్షణ, సమస్యలకు సంబంధించిన తమ పత్రాలను సమర్పించారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్లకు 'ఐఎన్ఎస్ఏ' అవార్డులు



మాజీ వీసీ అప్పారావు



డా. ముత్తమిల రసన్

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మాజీ వీసీ అప్పారావు పొదిలే, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం ముత్తమిలరసన్‌లను 'ఐఎన్ఎస్ఏ' సత్కారం లభించింది. ప్రొఫెసర్ అప్పారావు, ప్రొఫెసర్ డాక్టర్ ఎం ముత్తమిలరసన్ ఐఎన్ఎస్ఏ విశిష్ట ఉపన్యాస అవార్డుకు ఎంపికయ్యారు. ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ (ఐఎన్ఎస్ఏ) నుంచి 2023 సంవత్సరానికి ఐఎన్ఎస్ఏ అసోసియేట్ ఫెలోషిప్‌కు ఎంపిక కావడం విశేషం. వీరిని హెచ్‌సీయూ ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ, అధికారులు అభినందించారు.

హైదరాబాద్‌లో ఉద్యోగావకాశాలు మెండు

మాదాపూర్: కంపెనీల ప్రధాన కార్యాలయాలు హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడంతో ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయని పంచాయితీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు పేర్కొన్నారు. మాదాపూర్‌లో క్వాంటమ్ ఏఐ గ్లోబల్ నూతన కార్యాలయాన్ని టీఆర్ఎస్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, సినీ నిర్మాత దిల్‌రాజు, కంపెనీ సీఈఓ సంజయ్ చిత్తోర్‌లతో కలసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఐటీ కంపెనీలకు అండగా ఉంటుందని మరిన్ని ఉద్యోగాలు కల్పించే దిశగా ముందుకుసాగాలని కోరారు. కంపెనీ సీఈఓ సంజయ్ చిత్తూరి మాట్లాడుతూ క్వాంటమ్ ఏఐ గ్లోబల్ వినూత్న ఉత్పత్తులు బహుళ అంతర్జాతీయ మార్కెట్‌లోకి విస్తరించి ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల కోసం ప్రత్యేక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాడెక్ట్‌ను తయారు చేసినట్టు తెలిపారు.కార్యక్రమంలో అడిషనల్ డీఐజీ సీఐడీ మహేశ్‌భగవత్, మ్యాంగో టీవీ ఓనర్ రామ్ వీరమాచినేని పాల్గొన్నారు.



కొండాపూర్‌లో కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషన్



బైక్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న జీఎస్ కాల్‌టెక్స్ సీఈఓ రాజేష్ తదితరులు

గచ్చిబౌలి: మోటార్ సైకిల్ సర్వీస్‌లో కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషన్లు విప్లవాత్మక మార్పులు తీసుకొస్తాయని జీఎస్ కాల్‌టెక్స్ ఇండియా సీఈఓ రాజేష్ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్‌లో జీఎస్ కాల్‌టెక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దేశంలోనే మొదటి కిక్స్ స్మార్ట్ బైక్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోమెటిక్ లూబ్రికెంట్లలో జీఎస్ కాల్‌టెక్స్ ఇండియా అగ్రగామిగా ఉందన్నారు. మొదటి దశలో కిక్ స్మార్ట్ బైక్ స్టేషన్లతో పాటు 25 సర్వీస్ స్టేషన్లు ప్రారంభిస్తామని తెలిపారు. రెండో దశలో 50 స్టోర్‌లను అందుబాటులోకి తీసుకొస్తామని ఆయన వివరించారు. బైక్‌ల మెరుగైన పనితీరుతో వినియోగదారుల నుంచి డిమాండ్ ఉందన్నారు. స్మార్ట్ కిక్స్ బైక్‌లకు అన్ని సర్వీసులు ఒకే చోట లభిస్తాయని చెప్పారు. కార్యక్రమంలో జీఎస్ కాల్‌టెక్స్ జీఎం(మార్కెటింగ్, కె.మధు మోహన్, జీఎం(రిటైల్) మల్హోత్ర తదితరులు పాల్గొన్నారు.

11,500 వాహనాల వేలం.. రూ.6.50 కోట్లు రాబడి

సైబరాబాద్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర వెల్లడి

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్‌లలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఇప్పటి వరకు 12 విడతల్లో వేలం వేసినట్లు సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర బుధవారం తెలిపారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటనను విడుదల చేశారు. మొత్తంగా 11,500 వాహనాలను వేలం వేయడం ద్వారా సుమారు రూ.6.50 కోట్లు సమకూరాయన్నారు.సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మరో సుమారు 5వేల వాహనాలకు సంబంధించిన మూడు నోటీసులు కూడా జారీ చేయడం జరిగిందన్నారు. త్వరలో వాటికి వేలం వేస్తామని ఆయన స్పష్టం చేశారు. సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో మరో 4వేలకు పైగా వాహనాలు లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లలో ఉన్నాయని, వాటిని సంబంధించిన నోటీసులు కూడా త్వరలో జారీ చేస్తామన్నారు. వాహనాలకు సంబంధించిన వివరాలను అన్ని వెబ్ సైట్ www.cyberabadpolice.gov.inలో పొందుపరి చామన్నారు. అభ్యంతరాలు ఉన్న వాహనాల యజమానులు ఆరు నెలల కాలపరిమితిలోపు తమ వాహనాలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలతో సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎంటీ–2 ఎన్ వీరలింగం సెల్ నెంబర్ 9490617317లో సంప్రదించాలని ఆయన సూచించారు.

రూ.90 లక్షలతో హఫీజ్‌పేట్ శ్మశానవాటిక అభివృద్ధి

ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ శ్మశానవాటికను రూ.90లక్షలతో అభివృద్ధి చేస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం హఫీజ్‌పేట్ శ్మశానవాటికలో కార్పొరేటర్లు పూజిత, జగదీశ్వర్‌గౌడ్‌లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆఖరి మజిలీని వైకుంఠధామంలాగా మార్చాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, అందులో భాగంగానే శ్మశానవాటికలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆహ్లాదకరమైన ప్రశాంత వాతావరణం కోసం మొక్కలు నాటతామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, సంజీవరెడ్డి, యాదగిరి, వెంకటేష్ గౌడ్, మల్లేష్‌గౌడ్, దాత్రిగౌడ్, ప్రవీణ్‌గౌడ్ పాల్గొన్నారు.



హఫీజ్‌పేట్ శ్మశానవాటికలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గాంధీ

రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరాలి

పార్టీ సీనియర్ నాయకులు రఘునాథ్ యాదవ్



రఘునాథ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరిన యువకులు

గచ్చిబౌలి: కాంగ్రెస్ విజయం సాధించడానికి కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఆ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ పేర్కొన్నారు. మసీద్‌బండ వడ్డెరబస్తీ, ఇజ్జత్‌నగర్‌ల నుంచి భారీ సంఖ్యలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ మాట్లాడుతూ నయా నిజాంను తరిమికొట్టాల్సిన అవసరం ఉందని, నాయకులు, కార్యకర్తలు అలుపెరగని పోరాటం చేయాలని సూచించారు. కార్యక్రమంలో విష్ణు యాదవ్, పృథ్వీ, లక్కీ, నరేష్, వెంకటేష్, మోహన్, జనార్దన్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్టి చేతులు.. మట్టి గణపతులు

పటాన్‌చెరు టౌన్ : చిన్నారి చేతులు మట్టి గణపయ్యలను రూపొందించాయి. పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ రుద్రారం ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్) విద్యార్థులు బుధవారం మట్టి గణపతులను రూపొందించారు.గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ దత్తాత్రి కె.నగేష్ పర్యవేక్షణలో రసాయన శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ టీబీ పాత్రుడు, పర్యావరణ పాఠ్యాంశ బోధకులు డాక్టర్ ఉమాదేవి నేతృత్వంలో పలువురు బీఎస్సీ, ఈడబ్ల్యూబీ విద్యార్థులు బాలబాలికలకు మట్టి గణపయ్యల రూపకల్పన పోటీలు పెట్టారు. విజేతలను ప్రకటించారు. విశిష్ట సృజనకు గాను వీరేందర్, దుర్గాప్రసాద్‌కు ప్రథమ బహుమతి లభించింది. ద్వితీయ బహుమతిని మధుప్రియ, వైష్ణవి, నాగశ్రీ,దివ్యల బృందం గెలుచుకోగా, శ్రీమణి జట్టు తృతీయ బహుమతిని దక్కించుకుంది. మిగిలిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



పార్టీలో చేరిన వారితో నాయకుడు రవికుమార్ యాదవ్

బీజేపీలో చేరిక

గచ్చిబౌలి: మసీద్‌బండలోని పార్టీ కార్యాలయంలో పీజేఆర్‌నగర్‌కు చెందిన పలువురు యువకులు బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవి కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతికి దిక్కులేదని విమర్శించారు. రాష్ట్రం సాధించడంలో యువకులదే కీలక పాత్ర అని, పదేళ్లయినా వారికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని, అన్ని వర్గాలకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల పార్లమెంట్ యువమోర్చా కో కన్వీనర్ భరత్, ప్రశాంత్, సన్నీ, ప్రవీణ్, రాకేష్, శివ, శ్రీకాంత్, పవన్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిమజ్జన కోనేరుల పరిశీలన

మియాపూర్ : మియాపూర్‌లోని గుర్నాథం చెరువు వినాయక విగ్రహ నిమజ్జన కోనేరులను చందానగర్ సర్కిల్ 21 ఉప కమిషనర్ వంశీకృష్ణ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... నిమజ్జనాలు చేసేందుకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అధికారులు కోనేరులో శుభ్రమైన నీటిని నింపాలని సూచించారు. ఆయన వెంట జీహెచ్‌ఎంసీ సర్కిల్ 21 వైద్యాధికారి కార్తీక్, అధికారులు పాల్గొన్నారు.



కోనేరును పరిశీలిస్తున్న ఉప కమిషనర్ వంశీకృష్ణ